# శార్దూల్ శతకం

తనుశ్‌తో కలిసి ముంబైని ఆదుకున్న ఆల్‌రౌండర్

మళ్లీ విఫలమైన రోహిత్, జైస్వాల్

ముంబై: టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ (119 బంతుల్లో 113 నాటౌట్, 17 ఫోర్లు) వీరోచిత శతకంతో జమ్ము కశ్మీర్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ముంబై భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. శార్దూల్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ తనుష్ కొటియాన్ (58 నాటౌట్, 6 ఫోర్లు) ఆదుకోవడంతో రెండో ఇన్నింగ్స్‌లో ముంబై రెండో రోజు ఆట ముగిసే సమయానికి 274/7 పరుగులు చేసింది. ఈ ఇద్దరూ రాణించడంతో ముంబైకి 188 పరుగుల ఆధిక్యం లభించింది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 174/7తో రెండో రోజు ఆరంభించిన జమ్ము కశ్మీర్.. 206 పరుగులకు ఆలౌట్ అవడంతో ఆ జట్టు 86 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ముంబైకి ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (26), రోహిత్ శర్మ (28) మొదటి వికెట్‌కు 54 పరుగులు జోడించి మెరుగైన ఆరంభమే అందించారు. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించినా ఈ ఇద్దరూ.. యుధ్‌వీర్ సింగ్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేయడంతో ముంబై ఇన్నింగ్స్ మరోసారి పేకమేడలా కూలిపోయింది. రహానే (16), శ్రేయస్ (17) విఫలమవగా దూబె మళ్లీ డకౌట్ అయ్యాడు. 101 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన ముంబైని.. శార్దూల్, తనుష్ ఆదుకుని అజేయమైన 8వ వికెట్‌కు 173 పరుగులు జోడించారు.

**జడేజాకు 12 వికెట్లు.. పంత్ విఫలం**

ఢిల్లీతో వడోదరాలో జరిగిన మ్యాచ్‌లో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (7/38, తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు) మాయ చేయడంతో సౌరాష్ట్ర ఘన విజయం సాధించింది. పంత్ (17) మళ్లీ విఫలమయ్యాడు.

# సెహ్వాగ్, ఆర్తీ బంధానికి తెర!

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో విడాకుల వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇప్పటికే హార్దిక్ పాండ్యా, నటాషా స్టాన్కోవిచ్ విడిపోగా, ఇటీవల చాహల్, ధనశ్రీ వర్మ విడిపోతున్నట్లు వార్తలు రాగా తాజాగా క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్, ఆర్తీ వివాహ బంధానికి త్వరలో ముగింపు పడనుందా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. గత కొన్ని రోజులుగా అంటిముట్టనట్లు ఉంటున్న సెహ్వాగ్, ఆర్తీ విడాకులు తీసుకునేందుకు సిద్ధమైనట్లు జాతీయ వార్తాసంస్థలు తమ కథనాల్లో పేర్కొన్నాయి. ఆర్తీ తన సోషల్‌మీడియా అకౌంట్‌లో సెహ్వాగ్ ఫొటోలు తీసేయడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. సరిగ్గా 20 ఏండ్ల క్రితం 2004లో పెండ్లి చేసుకున్న సెహ్వాగ్, ఆర్తీ దంపతులకు ఆర్యవీర్, వేదాంత్ ఇద్దరు పిల్లలు.

# ఐసీసీ టెస్టు జట్టులో బుమ్రా, జడ్డూ, జైస్వాల్

వన్డే జట్టులో టీమ్‌ఇండియాకు నిరాశ

దుబాయ్: గతేడాదికి గాను ఐసీసీ ప్రకటించిన అత్యుత్తమ టెస్టు జట్టు (ఐసీసీ టెస్ట్ టీమ్ ఆఫ్ ది ఈయర్-2024)లో భారత్ నుంచి ముగ్గురు క్రికెటర్లు చోటు దక్కించుకున్నారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌కు స్థానం లభించింది. ఆసీస్ సారథి పాట్ కమిన్స్‌ను సారథిగా ప్రకటించిన ఐసీసీ.. ఇంగ్లండ్ నుంచి నలుగురు క్రికెటర్ల( జో రూట్, హ్యారీ బ్రూక్, జెమీ స్మిత్, బెన్ డకెట్)ను ఎంపిక చేసింది. వన్డే జట్టులో భారత్ నుంచి ఒక్క క్రికెటర్ కూడా చోటు దక్కించుకోలేకపోయాడు. గతేడాది భారత్ లంకతో మూడు వన్డేలు మాత్రమే ఆడటమే ఇందుకు కారణం. శ్రీలంక కెప్టెన్ చరిత అసలంకతో పాటు పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌కు చెందిన పది మంది క్రికెటర్లు వన్డే జట్టులో చోటు సంపాదించారు. మహిళల విభాగంలో 'వన్డే టీమ్ ఆఫ్ ది ఈయర్' జాబితాలో టీమ్‌ఇండియా నుంచి స్మృతి మంధాన, దీప్తి శర్మ ఎంపికయ్యారు.

# అయ్యో జొకో!

గాయంతో సెమీస్ మధ్యలోనే నిష్క్రమణ

25వ గ్రాండ్‌స్లామ్ వేటకు బ్రేక్

ఫైనల్‌లో జ్వెరెవ్‌తో తలపడనున్న సిన్నర్

వయసు మీద పడుతున్నా యువకులతో సమానంగా పోటీపడుతూ కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ సాధించాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియా ఓపెన్ బరిలో నిలిచిన ఆధునిక టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అల్కరాజ్ వంటి బలమైన ప్రత్యర్థిని దాటి.. టైటిల్‌కు రెండు అడుగుల దూరంలో ఉన్న అతడి జోరుకు గాయం అడ్డుకట్ట వేసింది. సెమీస్‌లో ఎడమ కాలి గాయం తిరగబెట్టడంతో తొలి సెట్ ముగియగానే జొకో.. నిరాశగా కోర్టును వీడాడు. నొవాక్ తప్పుకోవడంతో అతడి సెమీస్ ప్రత్యర్థి జ్వెరెవ్.. ఫైనల్‌లో డిఫెండింగ్ చాంపియన్ సిన్నర్‌తో తాడోపేడో తేల్చుకోనున్నాడు.

**మహిళల ఫైనల్స్**

**కీస్ X సబలెంక**

మ.2 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో

మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు భారీ షాక్ తగిలింది. తనకు పది టైటిల్స్ అందించిన ఆస్ట్రేలియా ఓపెన్‌లోనే ఈ రికార్డును సాధించే దిశగా సెమీస్ చేరిన సెర్బియా యోధుడి పోరాటానికి గాయం బ్రేక్ వేసింది. రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి సెమీస్‌లో ఏడో సీడ్ జొకో 6-7 (5/7)తో రెండో సీడ్ జర్మన్ ప్లేయర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ చేతిలో ఓడాడు. గంటా 21 నిమిషాల పాటు జరిగిన పోరులో ఒకే ఒక సెట్‌ను గెలిచేందుకు జొకో, జ్వెరెవ్ హోరాహోరీగా పోరాడారు. టైబ్రేక్‌లో ఇబ్బందిపడ్డ నొవాక్..జర్మనీ ఆటగాడు సెట్ నెగ్గగానే నెట్ దగ్గరకు వెళ్లి అతడికి షేక్ హ్యాండ్ ఇచ్చి అక్కడ్నుంచి నిరాశగా వెళ్లిపోవడంతో అతడి అభిమానుల గుండె పగిలింది. అతడి నిష్క్రమణతో జ్వెరెవ్ తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. మ్యాచ్ అనంతరం జొకో మాట్లాడుతూ.. 'ఒకవేళ నేను మొదటి సెట్‌ను గెలిచినా మ్యాచ్ నుంచి తప్పుకునేవాడిని. బంతిని కొట్టేందుకు కూడా వీలుకానంతగా గాయం ఇబ్బంది పెట్టింది. క్వార్టర్స్‌లో అల్కరాజ్ మ్యాచ్ నుంచే గాయం వేధిస్తోంది' అంటూ భావోద్వేగంగా మాట్లాడాడు.

**ఫైనల్‌కు సిన్నర్**

పురుషుల సింగిల్స్ రెండో సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ వరుసగా రెండో ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. సెమీస్‌లో ఈ ఇటలీ కుర్రాడు 7-6 (7/2), 6-2, 6-2తో అమెరికా సంచలనం బెన్ షెల్టన్ (అమెరికా)పై సునాయాస విజయం సాధించాడు. టోర్నీ ఆసాంతం అద్భుతంగా రాణించి తన కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ సెమీస్ చేరిన షెల్టన్.. కీలక పోరులో మాత్రం సిన్నర్ జోరు ముందు నిలవలేకపోయాడు. తొలి సెట్‌లో కాస్త పోరాడిన అతడు ఆ తర్వాత తేలిపోయాడు. మ్యాచ్‌లో సిన్నర్ 8 ఏస్‌లు, 23 విన్నర్లు కొట్టాడు. 55 అనవసర తప్పిదాలతో షెల్టన్ మూల్యం చెల్లించుకున్నాడు. ఆదివారం జరుగబోయే ఫైనల్‌లో సిన్నర్.. జ్వెరెవ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో భాగంగా అరీనా సబలెంక, మాడిసన్ కీస్ శనివారం టైటిల్ పోరులో తలపడనున్నారు.

# హైదరాబాద్ 565

హిమాచల్ ప్రదేశ్‌తో రంజీ పోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రంజీ ఎలైట్ విభాగంలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 565 పరుగులకు ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోరు 291/2తో రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్.. అదే జోరును కొనసాగించింది. తన్మయ్ అగర్వాల్ (177) భారీ ఇన్నింగ్స్ ఆడగా హిమతేజ (76), రక్షణ్ (42 నాటౌట్) రాణించారు. రాజస్థాన్ బౌలర్లలో వశిష్ట (4/92) నాలుగు వికెట్లు పడగొట్టాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హిమాచల్.. ఒక వికెట్ నష్టానికి 33 పరుగులు చేసింది. చేతిలో తొమ్మిది వికెట్లు ఉన్న హిమాచల్ ప్రదేశ్ 532 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది.

# నయన పసిడి తీన్మార్

ఖేలో ఇండియా వింటర్ గేమ్స్

లేహ్: ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణ యువ స్కేటర్ తాళ్లూరి నయన శ్రీ కొత్త చరిత్ర లిఖించింది. వరుసగా మూడో ఏడాది వింటర్ గేమ్స్‌లో పసిడి పతకంతో మెరుపులు మెరిపించింది. జమ్ము కశ్మీర్‌లోని లేహ్ వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో 15 ఏండ్ల నయన సత్తాచాటింది. శుక్రవారం జరిగిన మహిళల 500మీటర్ల షార్ట్ ట్రాక్ ఈవెంట్ రేసును నయన 1:01:35 సెకన్లలో ముగించి స్వర్ణం కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో ప్రతీక్ష(1:02:84సె, కర్నాటక), స్వరూప దేశ్‌ము ఖ్(1:03:15సె, మహారాష్ట్ర) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. 2023 నుంచి వరుసగా మూడోసారి వింటర్ గేమ్స్‌లో నయన పసిడి పతకాలు కైవసం చేసుకోవడం విశేషం. గతేడాది ఖేలోఇండియాలో ఈ యువ స్కేటర్ రెండు స్వర్ణాలు సాధించగా, జకార్తలో జరిగిన ఏషియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్ స్కేటింగ్‌లో అదరగొట్టింది. 'గుల్మార్గ్‌లో 2023 నుంచి తొలి స్వర్ణం నుంచి ఇప్పుడు హ్యాట్రిక్ సాధించడం చాలా సంతోషంగా ఉంది' అని పేర్కొంది.

# జోరు సాగనీ..

నేడు భారత్, ఇంగ్లండ్ రెండో టీ20

షమీకి తుది జట్టులో చోటు దక్కేనా?

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

చెన్నై: సొంతగడ్డపై పటిష్ట ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను అదిరిపోయే విజయంతో ఆరంభించిన యువ భారత జట్టు.. శనివారం రెండో పోరుకు సిద్ధమైంది. పొట్టి ఫార్మాట్‌లో వరల్డ్ చాంపియన్‌గా ఉన్న భారత జట్టు.. పటిష్ట ఇంగ్లీష్ జట్టును మరోసారి చిత్తు చేసి సిరీస్‌లో 2-0 ఆధిక్యం దక్కించుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. స్పిన్‌కు అనుకూలించే చెన్నై ఎం.ఏ. చిదంబరం స్టేడియం వేదికగా బట్లర్ గ్యాంగ్‌ను స్పిన్ ఉచ్చులో బంధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. సుమారు ఏడాదిన్నర విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన షమీకి ఈ మ్యాచ్‌లో అయిన తుది జట్టులో చోటు దక్కుతుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు మొదటి టీ20లో బ్యాటింగ్ వైఫల్యంతో తేలిపోయిన ఇంగ్లండ్.. చెన్నైలో పుంజుకోవాలని చూస్తోంది.

**జోరు మీదున్న టీమ్‌ఇండియా**

సీనియర్ల రిటైర్మెంట్ తర్వాత ఓపెనర్లుగా జట్టులోకి వచ్చిన అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ అంచనాలకు మించి రాణిస్తున్నారు. ఆరంభంలో మెరుపులు మెరిపిస్తున్న ఈ జోడీలో ఒకరు నిష్క్రమించినా మరొకరు భారీ షాట్లతో విరుచుకుపడుతూ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపెడుతున్నారు. గత ఆరు ఇన్నింగ్స్‌లో మూడు సెంచరీలు చేసిన శాంసన్.. కోల్‌కతాలో ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించినా దానిని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. అభిషేక్.. ఈడెన్ గార్డెన్ జోరు కొనసాగిస్తే ఇంగ్లీష్ బౌలర్లకు బడిత పూజ తప్పదు. కెప్టెన్ అయ్యాక స్థాయికి తగ్గట్టుగా ఆడలేకపోతున్న సూర్యకుమార్ యాదవ్.. పూర్వపు ఫామ్‌ను అందుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్‌రెడ్డితో భారత బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్ కొత్తబంతితో నిప్పులు చెరుగుతున్నాడు. అతడికి షమీ కూడా తోడైతే భారత పేస్ విభాగం మరింత పటిష్టమవుతుంది. అయితే షమీ వస్తే తుది జట్టులో ఎవరిని పక్కనబెడతారనేది చూడాలి.

# దళపతి 'రేపటి తీర్పు'?

తమిళ అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ ప్రస్తుతం తన 69వ చిత్రంలో నటిస్తున్నారు. హెచ్.వినోద్ దర్శకుడు. రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని నిర్ణయించుకోవడంతో తన కెరీర్‌లో ఇదే ఆఖరి చిత్రమని విజయ్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో ఈ సినిమా కోసం తమిళనాట ఆయన అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నామని నిర్మాతలు తెలిపారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'నాలైయ తీర్పు' (తెలుగులో 'రేపటి తీర్పు' అని అర్థం) అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని తెలిసింది. విజయ్ తొలి సినిమా పేరు కూడా ఇదే కావడం విశేషం. తన తండ్రి యస్.ఏ.చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'నాలైయ తీర్పు' అనే చిత్రం ద్వారా విజయ్ హీరోగా అరంగేట్రం చేశారు. ఆయన చివరి చిత్రానికి కూడా ఇదే పేరు ఖరారు చేసే అవకాశం ఉండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్న దృష్ట్యా సింబాలిక్‌గా ఈ టైటిల్ బాగా సెట్ అవుతుందని విజయ్ అభిమానులు సోషల్‌మీడియాలో కామెంట్ చేస్తున్నారు. దళపతి విజయ్ గతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు, రాజకీయ పార్టీ స్థాపనకు దారి తీసిన సంఘటనలను ప్రధానాంశాలుగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని సమాచారం.

చిత్రం

# తిరుపతిలో సెటిల్ అవుతా!

**తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి** అంటే కథానాయిక జాన్వీకపూర్‌కు అపరిమితమైన భక్తి. ప్రతి ఏడాది రెండు మూడుసార్లు శ్రీవారిని దర్శించుకుంటుంది. తన పుట్టిన రోజుతో పాటు, అమ్మ దివంగత శ్రీదేవి జయంతి సందర్భంగా తిరుమలకు రావడం ఆమె ఆనవాయితీగా పెట్టుకుంది. ఎప్పుడు తిరుమల దేవస్థానం ప్రస్తావన తీసుకొచ్చినా జాన్వీ కపూర్ ఆనందంతో పొంగిపోతుంది. తాజాగా ఓ టాక్‌షోలో పాల్గొన్న ఈ అందాల తార తిరుమల దేవస్థానంపై మరోమారు భక్తిభావాన్ని చాటుకుంది. పెళ్లయిన తర్వాత భర్తతో కలిసి తిరుపతిలో సెటిల్ అవ్వాలనే ఆలోచన ఉందని చెప్పింది. అక్కడ సాధారణ జీవితాన్ని గడపాలన్నది తన కల అని, అరిటాకులో భోజనం చేస్తూ , నిత్యం గోవింద నామస్మరణ వింటూ కాలం గడపాలని కోరుకుంటున్నానని తెలిపింది. ముగ్గురు పిల్లల్ని కని అక్కడే ప్రశాంతగా సెటిల్ కావాలనుకుంటున్నానని, తిరుమల సంప్రదాయానికి అనుగుణంగా తన భర్తను కూడా లుంగీ ధరించమని చెబుతానని జాన్వీకపూర్ పేర్కొంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. గత ఏడాది 'దేవర' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం రామ్‌చరణ్‌తో కలిసి విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్నది.

# వేసవిలో రానున్న 'జాట్'

బాలీవుడ్ అగ్ర హీరో సన్నీ డియోల్ నటిస్తున్న తాజా చిత్రం 'జాట్'. గోపీచంద్ మలినేని దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఏప్రిల్ 10న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ భుజంపై భారీ తుపాకీని మోస్తూ యాక్షన్ ప్యాక్డ్ అవతారంలో కనిపిస్తున్నారు. 'పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా ఇది. పోరాట ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయి. 'పుష్ప-2' చిత్రంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శించిన ఈ చిత్ర టీజర్‌కు మంచి స్పందన లభించింది' అని మేకర్స్ తెలిపారు. రణదీప్ హూడా, వినీత్‌కుమార్ సింగ్, సయామీఖేర్, రెజీనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్, రచన-దర్శకత్వం: గోపీచంద్ మలినేని.

# 'అఖండ-2'లో నాయికగా..

'భీమ్లానాయక్'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ సోయగం సంయుక్తమీనన్ ఆ తర్వాత వరుస సినిమాలతో తెలుగులో బిజీగా మారింది. ప్రస్తుతం ఈ భామ టాలీవుడ్‌లో మూడు చిత్రాల్లో నటిస్తున్నది. తాజాగా ఆమె మరో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ-2: తాండవం' చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్ ఇది. 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో సంయుక్త మీనన్ కథానాయికగా ఖరారైంది. కథాగమనంలో ఆమె పాత్ర కీలకంగా ఉంటుందని దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు.

# హృదయంలో రగిలే తుపాను

'మ్యాడ్' చిత్రం ద్వారా యూత్‌లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది అనంతిక సనీల్ కుమార్. ప్రస్తుతం ఈ భామ '8 వసంతాలు' అనే వినూత్న కథా చిత్రంలో నటిస్తున్నది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో అనంతిక..శుద్ధి అయోధ్య అనే అమ్మాయి పాత్రలో కనిపించనుంది. ఆమె తన ప్రేమకథను చెబుతున్న సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. ప్రేమ, ఎడబాటు, వేదన ప్రధానాంశాలుగా చక్కటి పొయెటిక్ ఫీల్‌తో సినిమాను రూపొందించారని టీజర్ చూస్తే అర్థమవుతున్నది. 'ఎవరి తుపాన్‌లు వారికి ఉంటాయి లోపల. కొందరు బయటపడతారు. ఇంకొందరు ఎప్పటికీ పడరు' అంటూ టీజర్ చివరలో కథానాయిక చెప్పిన డైలాగ్ హార్ట్‌టచింగ్‌గా అనిపిస్తుంది. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. హనురెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, రచన-దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి.

# పగ తీర్చుకునే 'వెంకటలచ్చిమి'

'ఆర్ఎక్స్ 100' 'మంగళవారం' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైంది కథానాయిక పాయల్ రాజ్‌పుత్. ఆమె టైటిల్ రోల్‌ని పోషిస్తున్న తాజా చిత్రం 'వెంకటలచ్చిమి' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పాన్ ఇండియా స్థాయిలో ఆరు భాషల్లో తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి ముని దర్శకత్వం వహిస్తున్నారు. రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మాతలు. ఆదివాసీ మహిళ ప్రతీకార కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు ముని పేర్కొన్నారు. ఈ కథ తనకు ఎంతగానో నచ్చిందని, ఈ సినిమా తర్వాత తనను ప్రేక్షకులు వెంకటలచ్చిమి అనే పేరుతో పిలుస్తారని, అంత బలమైన భావోద్వేగాలుంటాయని పాయల్ రాజ్‌పుత్ చెప్పింది. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిశా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ముని.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.